మైనారిటీ సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- కమ్యూనిటీ హాలు, లైబ్రరీకి రూ 1.98 కోట్లతో శంకుస్థాపన
- ప్రారంభించిన ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా
- ప్రారంభోత్సవం వద్ద టీడీపీ నేతల డ్రామా
- బుద్ధి చెప్పి పంపిన ముస్లిం మత పెద్దలు



శంకుస్థాపనలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రాష్ట్ర చరిత్రలో మైనారిటీల సంక్షేమం కోసం అనునిత్యం పాటుపడింది ఎవరైనా ఉన్నారంటే.. దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని అంజుమన్ షాదీఖానా వద్ద ఉన్న రెడ్ ట్యాంక్‌లో రూ. 1.98కోట్ల వ్యయంతో మజ్లిసుల్ ఉలమా, జమైతుల్ ఉలమా, తబ్లిగ్ జమాతులా ముస్లీం కమ్యూనిటీ హాల్, లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ముస్లీం మైనారిటీ వర్గాలకు 4శాతం రిజర్వేషన్ కల్పించిన మహానీయుడు డాక్టర్ వైఎస్సార్ అని కీర్తించారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా మైనారిటీల అభ్యున్నతికి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మైనారిటీలంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని, వైఎస్. జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు చేసిన మేలు ఏమి లేదని విమర్శించారు. ముస్లింలను సొంత మనుషుల్లా భావించే వ్యక్తి సీఎం వైఎస్. జగన్ అని స్పష్టం చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నేతలు గులాం రసూల్, ముస్లిం మతపెద్దలు, కార్పొరేటర్లు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

నసీర్ నటన.. బుద్ధి చెప్పిన మత పెద్దలు

కమ్యూనిటీ హాలు, లైబ్రరీ శంకుస్థాపన కార్యక్రమం జరుగుతున్న సమయంలో టీడీపీ ఈస్ట్ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ అక్కడకు చేరుకున్నారు. కొంత మంది డ్రామా బ్యాచ్ నాయకులతో కలసి వీధి నాటకానికి తెరదీశారు. ముస్లింలకు ప్రభుత్వం ఏం చేసిందంటూ.. యాక్టింగ్ చేసేందుకు ప్రయత్నించారు. దీనితో అక్కడే ఉన్న మత పెద్దలు, ఇమామ్‌లు, మౌజాన్‌లు నసీర్ అహ్మద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంతోషకరమైన వాతావరణంలో జరుగుతున్న శుభప్రదమైన కార్యక్రమాన్ని చెడగొట్టే ప్రయత్నం చేయటం సబబుకాదని నసీర్‌కు బదులు సమాధానామిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైనారిటీ వర్గాలకు మేలు జరగటంతో పాటు, కమ్యూనిటీ హాలు భవనం, లైబ్రరీ వంటివి నిర్మిస్తుంటే.. అడ్డుకునే ప్రయత్నం చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. నసీర్ అహ్మద్‌తో పాటు అక్కడకు వచ్చిన టీడీపీ డ్రామా బ్యాచ్‌కు ఎదురుదెబ్బ తగలడంతో అక్కడ నుంచి జారుకున్నారు.

ఆరోపణలు నిరూపిస్తే.. మా నాన్న.. నేను రాజకీయ సన్యాసం చేస్తాం

అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే టీడీపీ నేతలు అడ్డుకోవటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ధ్వజమెత్తారు. మంచి చేస్తుంటే.. నసీర్‌అహ్మద్ అతని ముఠా ఉద్దేశపూర్వకంగా వాదనలకు దిగడాన్ని ఖండించారు. ఒక మైనారిటీ వ్యక్తి అయి ఉండి.. ముస్లింల కోసం నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడంపై మండిపడ్డారు. తమ కుటుంబంపై టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలకు బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఒక్క ఆరోపణ నిరూపించినా.. తన తండ్రి, తాను రాజకీయ సన్యాసం చేస్తామని స్పష్టం చేశారు. దశాబ్దాల రాజకీయ చరిత్రలో మచ్చలేని వ్యక్తి తన తండ్రి ఎమ్మెల్యే ముస్తఫా అని, అన్ని వర్గాల ప్రజలతో మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. టీడీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుని, నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన పార్టీ నేతలు



పార్టీలో చేరిన వారితో నూరిఫాతిమా

పట్నంబజారు: ముస్లిం మైనార్టీలకు మేలు చేసే ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అని నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో నియోజకవర్గంలోని 11వ డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన పార్టీ నేతలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ పార్టీలకు చెందిన మైనార్టీ ముఖ్య నాయకుడు అయూబ్, ఇబ్రహీం, ఇమ్రాన్, జబీ, అర్షమాన్‌లతోపాటు భారీ ఎత్తున పార్టీలో చేరిన వారికి నూరి ఫాతిమా కండువాకప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకులా వాడుకుందని విమర్శించారు. మైనార్టీలకు పదవులు ఇచ్చి సంక్షేమ పథకాలు అందజేసి వారి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి, ఉన్నత స్థాయికి తీసుకొచ్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కేదక్కుతోందని తెలిపారు. ముస్లిం మైనార్టీ వర్గాలు వైఎస్సార్‌సీపీకి పట్టుగొమ్మలని స్పష్టం చేశారు.

సీసీ రోడ్లు ప్రారంభం

గతంలో ఎన్నడూ లేనివిధంగా తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 54వ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్, శివనాగరాజుకాలనీ, ఆదిత్యనగర్ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రమ్య, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికల వసతి గృహంలో పరీక్షల కిట్ల పంపిణీ

గుంటూరు మెడికల్: చైత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మహిళా శిశు ప్రాంగణంలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థినులకు పరీక్షల కిట్లను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో తొలి మెట్టు పదో తరగతి పరీక్షలని, మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఏఎస్ ఫోకస్ అకాడమి డైరెక్టర్ కోటేశ్వర రావు, చైత్ర ట్రస్టు డైరెక్టర్ రవి దంపతులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి హిమశిల్ప పాల్గొన్నారు.

జీజీహెచ్ న్యూరాలజీ విభాగానికి స్మార్ట్ టీవీ బహూకరణ

ఆర్‌కే స్కాన్ అధినేత డాక్టర్ రమణకుమార్ రూ. 3 లక్షలు ఖరీదు చేసే స్మార్ట్ టీవీని న్యూరాలజీ వైద్య విభాగానికి బహూకరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, మచిలీపట్నం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందునర్మద, పలువురు పీజీ వైద్యులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో గ్రామాల్లో రోడ్లు ధ్వంసం

- టోల్ ఫీజు కట్టకుండా వాహనాల మళ్లింపు
- నిరసనకు దిగిన గ్రామస్తులు



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలోని గొడవర్రు చుట్టుపక్కలున్న ఇసుక రీచ్‌ల నుంచి లోడు లారీలు టోల్ ప్లాజా ఫీజు కట్టకుండా గ్రామాల్లోని చిన్నచిన్న రహదారుల్లో నుంచి గుంటూరు నగరానికి వెళ్లడంతో పలుచోట్ల బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పండగ అని కూడా చూడకుండా శుక్రవారం చిలువూరుకు చెందిన యువకులు, గ్రామ పెద్దలు లారీల్ని అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోల్ ప్లాజా ఫీజు చెల్లించకుండా వెళ్లేందుకు లారీ డ్రైవర్లు 40 నుండి 50 టన్నుల బరువుతో అతివేగంగా వెళ్లడంతో చిలువూరు, నంబూరు రోడ్‌లో వెళ్లడం వల్ల రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని తెలిపారు. లారీలు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. లారీ వస్తుంటే అది వెళ్లేంత వరకు వాహనాలు రోడ్డు పక్కకు తీసి ఆపాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ఓవర్‌లోడ్‌తో తిరిగే లారీలను అడ్డుకోవాలని, నిర్ణయించిన రహదారిలో గుంటూరు వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో గ్రామంతో పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని చిలువూరు గ్రామస్తులు తెలియజేశారు.

ముస్లింలకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి జగన్

తాడేపల్లి రూరల్ : రాష్ట్రంలో ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి న్యాయం చేశారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. వైఎస్సార్ సీపీ ఏడు అసెంబ్లీ సీట్లు కేటాయిస్తే టీడీపీ ఒక్కరికి మాత్రమే సీటు ఇవ్వడం ముస్లింపై వారికున్న చిత్తశుద్ధి వ్యక్తమవుతోందని తెలిపారు. చంద్రబాబునాయుడు ముస్లింలపై కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. రంజాన్ తోఫా ఇవ్వడం లేదని విమర్శలు గుప్పిస్తున్న టీడీపీ నేతలు సంవత్సరానికి ఒక్కసారి ఇచ్చే రూ. 200 సరుకులతో ముస్లింల జీవితాల్లో ఏ విధంగా అభివృద్ధి సాధ్యమవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, రాజకీయంగా సముచిత స్థానం కల్పించారని తెలిపారు. అన్ని రంగాల్లో ముస్లింల అభివృద్ధికి, సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

తాడేపల్లి రూరల్: త్వరలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ దుగ్గిరాల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు ఎన్నికలు, ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రతి ప్రాంతంలో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతలపూడి, ఈమని, పెరుకలపూడి గ్రామాల్లో స్థానిక సిబ్బందితో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలసి కవాతు నిర్వహించామని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ సిబ్బంది ప్రసాద్, సురేష్, శివాజీ, హెడ్ కానిస్టేబుల్ హుసీన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య నీరాజనం



పాత గుంటూరు: మహా శివరాత్రి సందర్భంగా బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ శివపాద మంజీరనాదం పేరుతో 'శివరాత్రి నృత్య జాగరణ' వైభవంగా నిర్వహించింది. కార్యక్రమాన్ని బొల్లేపల్లి సత్యనారాయణ, సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాకారులు శుక్రవారం రాత్రి 7 గంటలకు ప్రారంభించి శనివారం ఉదయం 6 గంటల వరకు నృత్య ప్రదర్శనలు చేశారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు స్వాగతం పలికారు. సుమారు వంద మంది నర్తకులు పదకొండు గంటల పాటు చేసిన నృత్య నీరాజనం సాగింది. పాల్గొన్న వారందరికీ నంది ప్రతిమల్ని నిర్వాహకులు బహుమతిగా అందించారు. నాట్యాచార్య డాక్టర్ కాజ వేంకట సుబ్రహ్మణ్యం, నాట్యాచార్య బాలు, నాట్యాచారిణి నల్లపాటి సుశీల, నాట్యాచారిణి సాయిమంజీర శిష్యులు వివిధ కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి భక్తుల్ని ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని నాగలక్ష్మి పర్యవేక్షించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడికొండ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బండారుపల్లి రైల్వే ట్రాక్‌పై 12వ కిలోమీటరు వద్ద జరిగింది. రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి మార్చురీకి తరలించినట్లు రైల్వే జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావునాయక్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నడికుడి జీఆర్పీ పోలీసుల్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

మహిళల చైతన్యంతోనే సమాజాభివృద్ధి

- నగరంలో ఘనంగా మహిళా దినోత్సవం
- పలువురు ఉద్యోగినులకు సన్మానం



ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయినులు, ఉద్యోగినులకు సత్కారం



ఎస్టీయూ కార్యాలయంలో ఉపాధ్యాయినులకు సత్కారం



నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజనీని సన్మానిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్



సన్మాన గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

నగరంపాలెం: మహిళల చైతన్యంతోనే సమాజ అభివృద్ధి చెందుతుందని జనసాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.అరుణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొరిటెపాడు ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా సదస్సు నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు పి.పార్వతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ మహిళలు అవకాశాల్ని చేజిక్కించుకుని, అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షురాలు వి.రాధిక మాట్లాడుతూ మహిళలంతా ఉద్యమంలా కలసి నడుద్దామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయినులు, ఉద్యోగినుల్ని సత్కరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ పూర్వ ఉపాధ్యక్షురాలు బి.మల్లీశ్వరి, జిల్లా మహిళా కార్యవర్గ కన్వీనర్ డి.నాగభారతి, జిల్లా గౌరవాధ్యక్షురాలు టి.రామలీల, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్, జిల్లా జోన్ కన్వీనర్ పి.నాగశివన్నారాయణ, కమిటీ సభ్యులు జి.దాస్, కె.రమేష్, పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో వేడుకలు

ఉపాధ్యాయినుల పక్షాన నిరంతరం ఎస్టీయూ పోరాడుతుందని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయినులను సత్కరించారు. ఈ సందర్భంగా జోసఫ్‌సుధీర్ బాబు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం పని చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడిమళ్ల ప్రసాద్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎల్.వీరాంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్లు కమతం శ్రీనివాసరావు, షేక్ బాజి పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

లక్ష్మీపురంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యురాలు నీరెన్ రావెల సూచించారు. న్యాయవాది పద్మజ మాట్లాడుతూ మహిళలంతా సాధికారతతో పాటు ప్రతి రంగంలోనూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాంతీయ మేనేజర్ జయ మండపే, చీఫ్ మేనేజర్ ఎం.శేషగిరి రావు, ప్రాంతీయ, లోకల్ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో..

స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైద్యురాలు బి. ప్యాట్రిసియా (వెల్లూరు) మాట్లాడుతూ పౌష్టికాహారం, శారీరక శ్రమ మన జీవితంలో భాగంగా మారాలని సూచించారు. మహిళలు- పీసీఓడీ, పీసీఓఎస్, ఆరోగ్యంపై జరిగిన సదస్సులోనూ ఆమె ప్రసంగించారు. విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. అనంతరం వైద్యురాలు ప్యాట్రిసియాను ఘనంగా సత్కరించారు. సదస్సులో ప్రిన్సిపాల్ బి.రోహిణీదేవి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారిణి జి.బిందు, ప్రియాంక పాల్గొన్నారు.

అవగాహన సంస్థ కార్యాలయంలో ....

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత్రి ఎ.వి.కె. సుజాత మాట్లాడుతూ గాయని పి.సుశీలకు పద్మావతి మహిళా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గానకోకిలకు డాక్టరేట్‌ను ప్రదానం చేయడం సంతోషదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఉమెన్స్ డే వేడుకలు

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శుక్రవారం గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని శుశృత హాలులో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. అనంతరం పలువురు నర్సింగ్ అధికారులు, సిబ్బందిని డాక్టర్ కిరణ్‌కుమార్ సత్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస్ ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్లు కె.ఆశసజని, గంగమ్మ, సమీనాబేగం, కిరణ్మయి, పద్మ, కమలకుమారి, గ్రాడిస్ లయోలా, ఇందిరాదేవి, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగినులకు డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ టి.వి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ మహిళలకు స్త్రీ శక్తి అవార్డులు ప్రదానం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకులు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సభకు మేకల రవీంద్రబాబు అధ్యక్షత వహించారు. డెప్యూటీ కలెక్టర్ కె. స్వాతి, బీసీ కార్పొరేషన్ ఈడీ డి. దుర్గాబాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా లెక్చరర్ యామిని సత్యప్రభ, జెడ్పీ హైస్కూల్ అసిస్టెంట్ భీమినేని పద్మావతి, ఉపాధ్యాయులు లంకా సంతోషకుమారి, ఏ. రూబీలకు స్త్రీ శక్తి అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో మిరియాల మురళీకృష్ణ, మిరియాల గోపీకుమార్, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పాల్గొన్నారు.



హెల్త్ ప్యాకేజీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రేష్ఠ హాస్పిటల్ వైద్యులు

శ్రేష్ఠ హాస్పిటల్‌లో ఉమెన్స్ డే వేడుకలు

గుంటూరు మెడికల్: మహిళ దినోత్సవం సందర్భంగా కౌమార దశ బాలికలు, మహిళలకు హెల్త్ ప్యాకేజీలు ఏర్పాటు చేశామని శ్రేష్ఠ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ వై.సుస్మిత చెప్పారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లోని హాస్పిటల్‌లో శుక్రవారం ఉమెన్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ పది నుంచి 18 సంవత్సరాల కౌమార దశ బాలికలకు రూ. 5,400 అయ్యే వైద్య పరీక్షల్ని కేవలం రూ. 2,400లకే చేస్తున్నామని తెలిపారు. మహిళలకు కూడా రూ. 11,800 అయ్యే వైద్య పరీక్షల్ని రూ. 5,400కే చేస్తున్నట్లు వెల్లడించారు. గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంతో పాటు, ఆర్థిక సామాజిక రంగాల్లో ముందుండి పురుషులకు దీటుగా కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సరళవేణి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ పరిణితి పాల్గొన్నారు.

కుల నిర్మూలనతోనే మహిళలకు విముక్తి

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



సభలో మాట్లాడుతున్న మాణిక్యవరప్రసాద్

పాత గుంటూరు: భారత దేశంలో కుల నిర్మూలనతోనే మహిళల విముక్తి సాధ్యమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వీసీకే (విముక్తి చిరుతల కక్షి)పార్టీ ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.జయసుధ ఆధ్వర్యంలో శుక్రవారం బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పూలే దంపతులు సమాజంలో అన్ని వర్గాల స్త్రీలకు విద్య నందించి భారత దేశంలో విజ్ఞాన విప్లవానికి నాంది పలికారని తెలిపారు. మహిళలు స్వశక్తితో పోరాడి సమస్యల్ని తామే పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విశ్రాంత డీఈవో కె.ఎఫ్.సత్యప్రియ, కులాంతర వివాహం చేసుకున్న రవికుమార్ దంపతులకు సన్మానించారు. కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.జె.విద్యాసాగర్, ఉగ్గం సాంబశివరావు, పి.వి.రమణయ్య, పిల్లి సుజాత, వేంపాటి విజయలక్ష్మి, డాక్టర్ ఎస్.అంజయ్య, విశ్రాంత ప్రొఫెసర్ కె.ఏబేలు పాల్గొన్నారు.



అవగాహన సంస్థ కార్యాలయంలో వేడుకలు




మాట్లాడుతున్న న్యాయవాది పద్మజ



వైద్యురాలు ప్యాట్రిసియాకు సత్కారం

• హరహర మహాదేవ !



శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానంలో విశేష అలకారంలో స్వామి

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నగరంలోని శైవక్షేత్రాలు భక్తులతో శోభిల్లాయి. ఉదయం నుంచే శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు విశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాత గుంటూరులోని శివాలయం, అంకమ్మ తల్లి దేవాలయం, అరండల్‌పేటలోని శివాలయం, కొత్తపేటలోని శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పలు ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు, దాతలు అల్పాహారం, పాలు, మజ్జిగ, మంచినీళ్లు అందించారు.

– పాత గుంటూరు/ గుంటూరు ఎడ్యుకేషన్



కొత్తపేట శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు